

# స్వయంకృతాపరాధం

శ్రీ రామరావు.

వీరాస్వామిభార్య ఆస్పత్రికి వొచ్చిందని విన్నాను. యేనాటి కానాడే వెళ్ళిచూచి రావాలను కోవడం, యేదో అవాంతరంరావడం జరుగుతూంది. యీవాళ యేలాగైనా వెళ్లితీరాలి.

నేనూ గదిగుమ్మం దగ్గిరకు వెళ్లేసరికి గొల్లుమన్నారు. నర్సులు పరుగెత్తుతున్నారు. వీరాస్వామి కుర్చీలో కూచున్న మనిషి అమాంతంగా క్రిందికి పడిపోయాడు. యేమిటిదంతాను? లోపలికి వెళ్ళిచూచాను. ఇనుప మంచంమీద వీరాస్వామిభార్యశవం వుంది. నా కాశ్చర్యమేసింది. పాపం! వీరాస్వామి నేమని వోదార్చను? అతని ముఖ మెలాచూడను?

రాత్రి యింటికివొచ్చి పండుకునేసరికి రమారమి పదకొండయింది. నాకేమిచేయడానికి తోచలేదు. గోడకు వేలాడదీసివున్న వీరాస్వామి 'ఫోటో' చూసేసరికి నా మనస్సు చివుక్కుమంది. దీపంకాంతి తగ్గించి, యేలాగో పక్కమీద పడుకున్నాను. ఏవో నా మెదడులో ఆలోచనలుతిరిగి పోతూన్నాయి.

*   *   *

వీరాస్వామి నేను ఒక గదిలోవుండి చదువుకున్నాం. తరుచు మేం అనేకవిషయాలు మాట్లాడుకుండేవాళ్లం. తెలివిగలబుర్రే మార్కులుకూడా, బాగానే వొస్తుండేవి. చాలా జాగ్రత్తయిన మనిషి.

నేను గదిలో చదువుకొంటున్నాను. వీరాస్వామి తలుపు తెరుచుకుని లోపలికి వొచ్చాడు. "ఉత్తరం వొచ్చిందోయ్. చెప్పానుగా, యీవాళో రేపో తప్పకండా వొస్తుందని" అంటూ మంచంమీద

కూచున్నాడు. నే చదువుతూన్నా, పుస్తకం మోకాళ్ల మీదపడేసి కుర్చీ అతనివేపుకు తిప్పి,

"అయితే వెళ్లక తప్పనంటావు?"

"అదేమిటోయ్ ప్రతీవిషయానికీ నీవలా మాట్లాడితే యేలాగోయ్. అంతా నీకులాగే సంస్కారాభిప్రాయాల్తోనే వుంటే మనము మనదేశం, యీ స్థితిలో వుండటమేం?"

"అదికాదు. నే చెప్పేదికాస్త బుర్రకి యెక్కించుకుని మాట్లాడుమరి. అంతా నీకులాగే చదువుకొని కూడా చచ్చుసంఘపు కట్టుబాట్లకి దాసులైతే దేశం మరేస్థితిలో వుంటుంది?"

"నీకేం-, చెప్పావు కబుర్లు. మీలో బాగా యుక్తవయసు వొచ్చిన పిల్లలు దొరుకుతారు"

"అది కాదోయ్, యిప్పుడుమాత్రం మేమంత మునిగిపోయింది, కార్యం చేసుకోకపోతే! అయినా ఆలోచించు-ముందు నీ పరీక్షలున్నాయి; యిప్పుడు నీవు కార్యానికి వెళ్తే యేలాగైనా యిరవై రోజులు పడుతుంది. యిక తరువాతంటావా.........నీ చదువు యెలాగూ సాగదు. అన్నివిధాలా పాడౌతుంది."

"సరే, యిప్పుడు వెళ్ళడం మానేస్తే వాళ్లేమనుకుంటారు. అసలు యింతకాలం వున్నందుకే వాళ్లెంతో నిష్ఠూరంగా నాన్నగారి పేర వుత్తరం వ్రాశారు; ఆ వుత్తరం నీక్కూడా చూపించాను."

"నిజమేనయ్యా-వాళ్ళ పరిస్థితుల్ని బట్టి వ్రాశారు. మన పరిస్థితుల్ని బట్టి మనం వ్రాయాలి. అంతేగాని వాళ్ళు కోపగించుకుంటారని మనం యింత డబ్బు తగలేసి, యీ సంవత్సరమంతా కష్టపడి రాత్రి అనకపలనక చదివిందంతా వృధా అయిపోదూ?"

అతనేమీ మాట్లాడలేదు. మళ్లా నే-

"అది కాకపోయినా వాళ్ళకి మాత్రం ఆ మాత్రం తోచవద్దూ? ఆ పిల్లకి మాత్రం యేమంత వయస్సుందని-పట్టుమని పదమూడేళ్ళన్నా లేవు. అప్పుడే యేమిటా తొందర."

"మీలో అంటే యిరవై యేళ్ళు వొచ్చినా వుంచుతారు. మాలో అలాక్కాదు. మరి యిరవై యేళ్ళు వచ్చేవరకు అంటే అది బాగా లేదులే మరి."

"ఆఁ ఆలాగేం! యెంత వయసుంటే అంత మంచిది. భార్యాభర్తల వయసు యెక్కువుంటె అంతగా పిల్లలు పుట్టరు. పుట్టినా చాలా బలంగా, ఆరోగ్యంగా వుంటారు. అంతేగాని పదమూడేళ్ళకే కార్యం. మరో తొమ్మిది మాసాలికి పిల్ల! ఆ పిల్ల ఆరోగ్యంగా యెలా వుంటుంది? యిక యీ దంపతులికి సుఖమెక్కడిది? యింకా ఆ పదమూడేళ్ళ తల్లికి పిల్లనేలా పెంచాలో యేమీ తెలీదు. ఆ పిల్లతో యాతన పడలేక యెంతో చికాకుగా, చీదరించుకొంటూ వుంటుంది. ఆలాంటప్పుడు సుఖంగా, ఆనందంగా తమ రోజుల్ని జరుపవలసిన ఆ యౌవన దంపతులకి యిక సౌఖ్యమేముటుంది?"

"అదేమిటి, అల్లాచేసుకున్నావాళ్ళంతా సుఖపడ్డం లేదంటావా? అదేంటోయ్ నీ వాదన! యౌవ్వన కాలంలో అంటే యిరవై యేళ్ళలోగా పిల్లలు పుట్టకూడదంటావు. అంతేనా నీ వాదన!"

"అంతే! అలా వున్నానాడే మనం మన దేశం బాగుపడుతుంది. ఒకవేళ ఆలా వుండడం కష్టమయితే, 'బర్తుకంట్రోల్' పద్ధతులు అనుసరించడం చాలా మంచిది ఆర్థికంగా, శారీరకంగా మన కెన్నో లాభాలున్నాయి."

"అదిగో! దించావు బర్తుకంట్రోలంటూనూ. యికా వుపన్యాసానికి అంతుంలేదు. యిక కట్టిపెట్టు బాబు! నీవిందాక చెప్పిందే చాలా బాగుంది, బర్తుకంట్రోలు కంటె, సెల్ఫ కంట్రోల్ చాలా మంచిది."

"నిజమే. కాని, అది అందరికి సాధ్యంకాదు చూడు. నీ కేసమయంలో.........చాలా మంచిదే మరి. నీ వే మాత్రం అనుసరించగలవు? యువకుడివై వుండి సాహసంతో మార్పుని మంచినీ గ్రహించక పోతే- మూడుకాళ్ల ముసలు లటోయ్ మార్పుని ధైర్యంతో, సాహసంతో యెదుర్కొని ఆహ్వానించేది?

"యికా గొడవ వదలవుకామోసు. మరి, నే వెళ్లక తప్పదోయ్ యిప్పుడు నేను వెళ్లకపోతే మామ గారికి కోపంరాదూ?"

"ఊఁ కోపంవస్తే యేం జేస్తారేం?"

"యిచ్చే ఆ నాల్గుడబ్బులు యివ్వరు; అప్పుడు మనపని యేమౌతుంది?"

"రెండు నెలలవరకు కావలసిన డబ్బు బేంకిలోనే వుంది. తరువాత సంగతంటవా? అప్పుడాలోచించచ్చు. యీలోగా యేవో రెండుత్తరంముక్కలు వ్రాసి పారేస్తే సరి. అన్నికోపాలు అణుగుతాయి. యెవరికోసం"

"యెవరికోసం అంటావు?"

"కూతురు కోసం"

అంతటితో ఆ విషయం చాలించాను. వాకే మారు అంతగాచెప్తే విసుగ్గా వుంటుందనీ పేపర్ల గురించీ, మేష్టర్లగురించి చాలాసేపు మాట్లాడుకున్నాం.

సాయంత్రం మామూలుగా షికార్ వెళ్లాం. సముద్రానికి దగ్గరగా యిసుకలో కూర్చున్నాం. ఒకో పెద్దకెరటం మా కాళ్లదగ్గరకికూడా వస్తూవుండేది. చల్లని గాలి వేస్తుంది. అప్పుడే వుదయిస్తున్నా చంద్రుడు బంగారుముద్దలా యెంతో అందంగా వున్నాడు.

"అయితే రేపు వెళ్ళక తప్పనంటావు?"

"ఆ. తప్పదు బాగుండదుచూడు; అన్నిఖర్చులు భరిస్తో మనకి యేదో అన్నివిధాలా సాయంచేస్తూంటే మనం యిలాచేశామంటే వాళ్లకి చాలా కష్టంగా వుంటుంది."

"నిజమే నీవేయిక్కడ యింత యిదవుతున్నప్పుడు యిక అక్కడ వాళ్లు.........అంటే ఆశ్చర్యమేంవుంది? సరే బాగానేవుంది. నీకూ వెళ్ళాలనే వుంది, వెళ్లు. కాని, నామాటమాత్రం చెవినిబెట్టు నీ మంచికోసం, నీ క్షేమంకోసం చెప్తున్నాను. ఆలా చెప్పవలసినవిధి మనమైత్రిలో వుంది. మీ దాంపత్యాన్ని, ప్రేమనీ, ఆనందాన్నీ పెంపొందించుకోవాలంటే బర్తుకంట్రోల్ చాలా అవసరం. నీ కింకా తెలియడం లేదు. కొంచెం దూరదృష్టితో యోచించు-నీ భార్యా, ఆరోగ్యంగా అందంగా, యౌవ్వనశోభతో కలకలలాడుతూ వున్నంతసేపే నీ ప్రేమా నీకబుర్లూనూ ఆ వేడిరక్తం, ఆ పిల్లలమరలో వాలికిపోయి వికృతాకారంతో యెప్పుడూ విసుక్కుంటూ యిదురోమంటూ ఆనందంలేక నిన్నాకర్షించలేక ఆమెయెన్నో తిప్పలు పడుతుంది. యిక నీసంగతంటవా? తోటలోకి వెళ్లామంటే గులాబీపువ్వునే కోస్తాంగాని బిళ్లగన్నేరు పువ్వుని కోస్తామా? ఆకర్షణీయంగా పరిమళంతోవున్నా గులాబి పువ్వునే కోస్తాం. ఎందుచేత? స్త్రీ అంతే! సౌందర్యమున్నంతసేపే స్త్రీమీద ఆ ప్రేమకూడాను. మరోవిషయం: స్త్రీకి ఒక సౌందర్యమే కాదు- విద్య వుంటే అన్నివిధాలా పనికొస్తుంది. స్త్రీవిద్యవల్లే మన సంఘంలోవున్న దురాచారాలన్నీ నశిస్తాయి. కాని మన స్త్రీలలో నూటికి యెంతమంది చదువుకొంది? చాలా తక్కువనే చెప్పాలి. అందుచేత సౌందర్యంలేని స్త్రీతో మనం కాపరంచేయడం చాలాకష్టం. దేశంలో మార్పునేది దానంతటదే జరిగిపోతుంది. దాన్ననుసరించ వలసిందే. ఉపన్యాస వేదికలెక్కి లెక్చెర్లుకొట్టే యీ మహానుభావులెవరూ, యీ సంస్కరణాకి పూనుకోరు. యే ముసల్దాని వంకో పెట్టి అపనికాస్తా పూర్తిచేస్తారు. యింక మరో రకం వున్నారు! ఆఁ వెళ్లాం

అందకత్తైతే కొరుక్కు తిం'టామా!' అని వేదాంతం చెప్తారు. వీళ్లు యేకట్నం డబ్బులకో ఆశించుకున్న రకం. వాళ్లుమాత్రం తమ భార్యాల్తో ఆనందంగా సౌఖ్యంగా కాలం గడుపుతున్నా రనడం సాహసం. యే పట్నమో చేరడం యే వెలయాలినో వెతకడం, ఆ, ఆకలి, కామం తీర్చుకోవడం యింతే వీళ్ళపని. యింట్లో ఆ యిల్లాలుమాత్రం సరంబీ కమ్మలు లెక్కేస్తో యీదురోమంటూవుండాలి. యే బీచిలోనో అందమైన అమ్మాయో కనిపించిందంటే, ఆమెకోసం ఆమె పరిచయం కోసం తాపత్రయం పడేవాళ్ళు యెంతమంది లేరు. కాలేజీ అమ్మాయిలు, క్లబ్బుకొచ్చే అమ్మాయిలుకోసం రోజూ యెన్నో గాలన్లు పెట్రోలు తగలేసి వాళ్ళవెంట నీడలా తిరుగేవాళ్ళెంతమంది లేరు! దెబ్బల్ తిన్నావాళ్ళెంత మంది లేరూ? మొదట్లోనే కట్నం కోసం ఆశించక ఆ గడ్డి తినకండా చదువుకున్నా అమ్మాయినే అందమైన అమ్మాయినే తనకు నచ్చిన అమ్మాయినే చేసుకోరాదా? ఆమెతోనో ఆ ప్రియురాలుతోనే యెంత స్వల్ప జీవితం సాగిస్తేనేం అదే కాదటోయ్ స్వర్గం? నే చెప్పిన సంగతులన్నీ జాగ్రత్తగా యోచించి యిష్టం వచ్చినట్లు చేయ్." ఆ తరువాత చాలా సేపువరకు యెవరం మాట్లాడలేదు.

"నేను చెప్పినవన్నీ కాదని వొప్పించు. పోనీ నాదే తప్పయితే తప్పకండా మారిపోతాను."

"అది కాదులే. నీవు చెప్పినవన్నీ బాగానే వున్నాయి. కాని, నేను వెళ్లడం మానను."

"సరే, బాగానే వున్నది. నేవెళ్లొద్దంటానా! నీ భార్యామీద..........యిదిగా వుంటేను! తప్పకండా వెళ్ళు; కాని వెన్నెల్లో వున్న నీ జీవితాన్ని చీకటిగా చేసేసుకోకు. అదే నే కోరడం. లేత వయసు, లోనే పిల్లని కనడం మంచిది కాదు. కొంచెం యోచించు. బర్తుకంట్రోల్ పద్ధతుల కొంతకాలం మీద........చాలా బావుంటుందని నా అభిప్రాయం."

నామాట లేవీ ఆతరుణంలో అతని చెవికి యెక్క లేదు. మర్నాడు కార్యానికి వెళ్లిపోయాడు. నాకు నవ్వొచ్చింది. చదువుకున్నావాడు, తెలివైన వాడు యిలా ప్రవర్తిస్తే యిక మన భారతదేశం బాగుపడేదేం?

* * *

కార్యం అయిన పదిరోజుల్లోనే వొచ్చాడు. కాని అదో రకంగా మారిపోయాడు. రెండు రోజులకో మారు భార్యా దగ్గరనుండి వుత్తరం వస్తేనే గాని వుండలేక అదోలా అయిపోయే వాడు. ఆమె యేదైనా పని వుండి వొకరోజు వుత్తరం వ్రాయాపోతే యెంతో యిదయ్యేవాడు. ఒకోమారు భోంచేయడం కూడా మానేసేవాడు...ఇదంతా చూస్తే నాకు నవ్వు వచ్చేది. కాని అతనెప్పుడూ అదోలా ఆలోచిస్తునే వుండేవాడు. నీరసంగా యెప్పుడుడూ పడుకొనే వుండేవాడు. యేమిటోయ్! అని అడిగితే యేదో అవకతవకగా జవాబు చెప్పేవాడు.

పేపర్లు బాగా వ్రాయలేదు. పరీక్ష పాసవలేదు. అయినా అతడేమీ లెక్క చేయలేదు. ఇదివరకూ వొక్కమార్కు యెందుచేతయినా పొరపాటున పోయిందంటే యెంతో యిదయ్యే వాడు. ఆలాంటివాడిలా మారిపోయాడేం? శలవులికి మళ్లా అత్తగారింటికి వెళ్లాడు. నేను శలవుల్లో సీజన్ టిక్కెట్టుతో యాత్రచేసి దేశం చాలావరకు చూచాను. సరే వీరాస్వామి మళ్లా వచ్చాడు. కాని యీమారు చాలా చిక్కిపోయాడు. ముఖం అంతా

అదోవిధంగా అయిపోయింది మనిషికూడా అదో రకంగావుండేవాడు. తరువాత నే బర్తుకంట్రోలు గురించేమీ అడగలేదు. అతనికి కష్టంగాకూడా వుండేది. పైగా మా మైత్రికికూడ భంగము వస్తుందని ఆ ప్రయత్నం చేయలేదు.

నేను బయటనుంచి వచ్చేసరికి వీరాస్వామి చదువుతున్నాడు. నేను కోటువిప్పి గోడకుతగిలించి కూచున్నాను. అతను భోజనానికి వెళ్లివస్తానని వెళ్లాడు. నాకేమి కాలక్షేపంగాక బల్లమీదవున్న కాగితాలు తిరగవేస్తూవుంటే వొకవుత్తరం కనిపించింది. అది వాళ్లమ్మ వ్రాసింది. వీరాస్వామిభార్య కడుపుతో వుందని వ్రాసింది. నా కాశ్చర్య మేసింది. నే అనుకొన్నంతా అయింది. ఆవుత్తరం బల్ల మీదే పారేశాను. ఆ విషయమై అతనితో నేనేమీ మాట్లాడలేదు.

తరువాత పట్నంనుండి యింటికి వెళ్లి పోవడం తటస్థమైంది. వీరాస్వామి దగ్గిరనుండి తరుచు వుత్తరాలు వస్తూనే వుండేవి. ప్రతివుత్తరంలోనూ యేదో వొక సంగతి యిరికించి తన భార్యాగురించి వ్రాసేవాడు. అదో ఆనందంగామో ననుకున్నా.

* * *

ఆమెకు యెనిమిదో మాసంలోనే నొప్పులు రావడం ఆమె కనలేకపోగ శిశువు పోవడం ఆ పల్లెటూరి మంత్రసానికి చేతగాక మావూరి ఆస్పత్రికి తీసుకువెళ్ళమంటే మావూరు తీసుకొచ్చారు. భార్యాను తీసుకొచ్చే ముందు వీరాస్వామి వచ్చాడు; అప్పుడు అడిగాను, నా వొళ్ళుమంట ఆగక. తెల్లమొఖంవేసి యేదో అయిపోయింది యిక ముందు జాగ్రత్తగా వుంటాను. అన్నాడు వీరాస్వామి. మొదట్లో ఆ సంగతి ఆమెతో చేస్తే ఆమె పాపమనీ, ప్రాణహాని అందట! యీ విషయాల్లో స్త్రీలు కాస్త జాగ్రత్తగా యోచించాలి, స్త్రీలే యీ విషయాల్లో కాస్త జాగ్రత్తపడి ముందడుగు వేశారంటే దేశసేవ చేయడానికి ఆదర్శమైన జీవితం సాగించడానికి అవకాశాలుంటాయి. స్త్రీలే జరూరుగా ప్రచారంలోకి తీసుకురావాలి. స్త్రీలే సాధారణంగా యీ విషయాల్లో పురుషులమాటలు తోసిరాజంటారు. అందుచేత చదువుకొన్నాస్త్రీలు తెలీని స్త్రీలకి బాగా బోధపర్చాలి.

